

# శత్రువు

జనవరి 30.

పొగమంచుతో సూరీడు సైతం పోరాడుతున్నట్టు పల్చటి కిరణాలు పండు వెన్నెల్లా ప్రకాశిస్తున్నాయి.

సైనిక గుడారాల్లో తచ్చాడుతున్న బూట్ల చప్పుళ్లు...అస్పష్టమైన ఆకారాలు తప్ప పలకరించేంత వరకూ ఎవరు ఎవరోనన్నంతగా గుర్తుపట్టనంత పొగమంచు...

వైర్‌లెస్ సెట్లలోంచి లీలగా విన్పిస్తున్న మాటలు...

కెప్టెన్ మన్‌ప్రీతమ్ తన గుడారంలోని మరో మిత్రుడు మేజర్ నయ్యర్‌తో పురూలియా పొలాల్లో ఆయుధాలు దించిన పారాచూట్‌ని చూసి ఏనుగని భయపడిన గిరిజన మహిళ మీద జోక్ ప్లే చేయటంతో ఇద్దరు బిగ్గరగా నవ్వుకుంటున్నారు.

అంతలోనే పరుగున వచ్చిన వ్యక్తి 'సార్ మీకు టెలిగ్రాం....' అన్నాడు.

కెప్టెన్ మన్‌ప్రీతమ్ మొహంలో నవ్వు మాయమైంది. మనసేదో కీడు శంకించింది. అమ్మకెలా వుందో... ఇంటినించే అయివుంటుంది ... అనుకుంటూ సంతకం చేసి టెలిగ్రాం తీసుకున్నాడు.

"మదర్ ఎక్స్‌పైర్డ్...స్టార్ట్ ఇమ్మీడియట్లీ... "

గుండె గోడలు కూల్చేసిన మరఫిరంగి ప్రతిధ్వనులు... కవాటాల్ని కత్తిరించేసి కన్నీటి బొట్టుని బోర్లించిన అక్షరాలు... మనసు పొరల్లోంచి ప్రవాహమై ఎగిసి కనుకొనుకుల తీరం దగ్గర ఆగినట్టు... దుఃఖాన్ని పెదాల మధ్య బిగపట్టి నిశ్శబ్దంగా తలతిప్పి మేజర్ వైపు చూసాడు.

"వాట్సద మ్యాటర్" చేతిలోని టెలిగ్రాం చదివి మేజర్ 'సారీ...కెప్టెన్ మనో...' అంటూ భుజం తట్టాడు.

"ఒకే... ఇప్పుడేం చేస్తావ్ ? మన దగ్గర పరిస్థితి ప్రశాంతంగానే వుంది. నువ్వో ఇరవైరోజులు లీవ్‌పెట్టి అమ్మ జ్ఞాపకాల్లో గడిపిరా... నేను కూడా చింతిస్తున్నాను" మేజర్ మరోసారి భుజం తట్టాడు.

ఛాతిని ఎగదన్నుకొస్తున్న దుఃఖం కెప్టెన్ మన్‌ప్రీతమ్ గొంతులో సుళ్ళు తిరుగుతోంది. మాటకూడా పెగలనివ్వని బాధతో అస్పష్టంగానైనా 'అమ్మా...అమ్మా' అంటూ పలవరించాడు. మరో నలుగురు కేడర్ గల సైనికులు విషయం తెలిసి వచ్చి బాధను వ్యక్తం చేసి వెళ్లిపోయారు.

కాని అప్పుడే... అనూహ్యంగా... కెప్టెన్ మన్‌ప్రీతమ్‌కి ప్రత్యేకమైన పిలుపొచ్చింది... సైనిక దినోత్సవంలో పాల్గొని వెళ్లిపోవల్సిన ఒక సెంట్రల్ కేబినెట్ మినిస్టర్ విమానం ద్వారా వాతావరణ పరిస్థితులు అనుకూలించక తిరిగి వచ్చిన నేపథ్యంలో అతడిని సైనిక హెలికాప్టర్ ద్వారా ఎడారి ప్రాంతం గుండా అత్యవసరంగా దేశ రాజధానికి తరలించాల్సిన బాధ్యత కెప్టెన్ మన్‌ప్రీతమ్‌పై పెడుతూ అర్జంట్ మెసేజ్ ప్రభుత్వం నించి అప్పుడే అందింది.

అంతా నిశ్చేష్టులయ్యారు...

మేజర్ నయ్యర్ అసహనంగా గొణుక్కున్నాడు.

"ఈ మినిస్టర్లతో ఇదే బాధ... మనో... యుకెన్ గో... నేను మేనేజ్ చేస్తాను" అన్నాడు.

"సర్... ఈ బెటాలియన్‌లో KP61 హెలికాప్టర్ ట్రెయినీ కెప్టెన్ మన్‌ప్రీతమ్ గారొక్కరే... " చాలా కూల్‌గా వినయంగా చెప్పాడో సైనికుడు.

"మినిస్టర్ గార్కి అంత అర్జంట్ ఏమిటట ? ఇప్పుడెలా ?" మేజర్ కోపంగా అరిచాడు.

అదంతా నిశ్శబ్దంగా వింటోన్న కెప్టెన్ మన్‌ప్రీత్ "సర్... డ్యూటీ ఈజ్ డ్యూటీ.

నేను వెళ్లేసరికి అమ్మనెలాగూ దహనం చేస్తారు. రేపు ఈవినింగ్ నించి లీవ్‌లో వుంటాను. బై... " కరచాలనం చేసి వేగంగా వెళ్లిపోయాడు జీప్పీ ఎక్కి....

జిప్పి హెడ్‌లైట్లు సైతం పొగమంచుని చీల్చలేకపోతున్నాయి. ఎవరి మధ్యా మాటలు దొరక్క నిశ్శబ్దంగా ఎవరికి వారు గూడారాల్లోకి వెళ్లిపోయారు. పొగమంచు మరింత చిక్కనవుతోంది...

★ ★ ★ ★

భూమి ఒళ్లంతా బంగారు పూత పూసుకున్నట్టు అందమైన ఎడారి... ప్రకృతి కన్యసిగ్గుతో ఎదమీంచి బంగారుపైట కప్పుకున్నట్టు ఇసుక దిబ్బలు...

అక్కడక్కడా బ్రహ్మజెముడు పొదలు...

హెలికాప్టర్ ఎడారికి తక్కువ ఎత్తులోనే నిదానంగా పయనిస్తోంది. దాన్ని నడుపుతున్న కెప్టెన్ మన్‌ప్రీతమ్‌తో పాటు తెల్లటి ఖద్దరులో నిండుగా ఒద్దికగా కూచున్నాడు సెంట్రల్ మినిస్టర్.

మరో గంటన్నరలో అతడు అత్యవసర సమావేశంలో పాల్గొనాల్సి వుంది. ఆ ఆరాటం మొహంలో తచ్చాడుతోంది.

మన్‌ప్రీతమ్ ఆలోచనలు అమ్మవైపు సాగాయి.

"తను సైన్యంలో వున్నంత కాలం... ఏ అభద్రతా భావం కలగకుండా నిశ్చింతగా నిద్రపోతానని ఉత్తరాలు రాసే అమ్మ... నీ కవాతు, నా గుండె శబ్దం ఒకేలా వుండాలనే అమ్మ...

నా ప్రేమ నీకు పహరా...

సరిహద్దుల్లోని సుదీర్ఘ శత్రుత్వం మీద సూర్యుడివై శిరసెత్తు... శత్రు శిబిరం మీద బాకువై మొలకెత్తు... "

అక్షరక్షరంలో వీరత్వాన్ని నింపిపంపిన అమ్మ ఇకలేదన్న సత్యం కన్నీటి బొట్టుతో సాక్ష్యం పలికింది. దుఃఖ పూరితమైన అతడి కళ్లని చూసి సెంట్రల్ మినిస్టర్ చిరాగ్గా మొహం చిట్లించుకున్నాడు. హెలికాప్టర్‌లో స్పీడ్ లేనందుకు అసహనంగా కదులుతున్నాడు.

"ఇలా అయితే యుద్ధమేం చేస్తారు వీళ్లు... రక్షణ శాఖే సగం బడ్జెట్ మింగుతోంది. నత్త వెధవలు...." మనసులో తిట్టుకున్నాడు. అతడి పరిస్థితి గమనించిన కెప్టెన్ తల్లి

ఆలోచనలోంచి బయటపడడానికి ప్రయత్నిస్తున్నాడు.

అతడికి రెండే తెలుసు.

మొదటిది అమ్మ...
రెండోది శత్రువు ....

అందుకే అతడి ఆలోచనలు పురూలియా సంఘటన వైపు తిరిగాయి.

వారణాసి నించి రాత్రి పదిగంటలకు బయలుదేరిన ఎ.ఎన్-26 విమానం అదే రాత్రి 11 గంటల 45 నిమిషాలకు కలకత్తా శివారు తారకేశ్వర్ మీదుగా ఎగురుతూ వాతావరణం బాగాలేనందున కలకత్తా విమానాశ్రయంలో దిగలేక నేరుగా యాంగోన్ వెళుతున్నామని చెప్పింది. ఎ.ఎన్ - 26 తిరిగి ఒంటి గంటకు కలకత్తా విమానాశ్రయంలో ఎందుకు దిగింది ? యాభై అయిదు నిమిషాల సేపు ఎ.ఎన్ - 26 ఎక్కడికెళ్లింది ?

పురూలియాలో జారవిడిచిన ఆయుధాలు ఎవరికి ? ఆనంద మార్గీయులకా ? అల్ఫాకా ? ఉత్తర మైన్మార్‌లోని కచిన్ ఇండిపెండెంట్ ఆర్మీకా ? ఎవరికి... ??

కెప్టెన్ మన్‌ప్రీతమ్ ఆలోచనలు చెదరగొడుతూ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నించి వై.ఎ. - 339 సందేశం నంబర్ విన్పించి అప్రమత్తుడయ్యాడు.

వైర్‌లెస్ ద్వారా రిపీట్ పంపాడు.

అతడికి వెంటనే మెసేజ్ విన్పించింది.

"కెప్టెన్... డి.జి.సి.ఎ కనీస క్లియరెన్స్ లేకుండా రెండు ఎ.ఎన్-26 విమానాలు మీ ఎడారి మార్గంలోనే వస్తున్నాయి. మూవ్‌మెంట్ లైజాన్ యూనిట్ ప్రకారం అవి మీ హెలికాప్టర్ సమీపంలో పయనిస్తున్నాయి. అవి ఆయుధాలు జారవిడిచే శత్రువిమానాలుగా ఐ.ఎ.ఎఫ్ గుర్తిస్తోంది. రిసెర్చ్ అండ్ ఎనాలిసిస్ వింగ్ (రా) హెచ్చరిక ప్రకారం అవి ఖచ్చితంగా ఆయుధాలు జారవిడిచే శత్రువిమానాలే ... ఓవర్..."

గగనతలంలోంచి మరోసారి ఆయుధ వర్షం కురువనుందన్న ఊహే నరాల్ని ఉప్పొంగిస్తే కళ్లగోళాల మీద ఎర్రజీరల జెండాలెగరేసి నెత్తుటి గీతం పాడటానికి సిద్ధమేనన్నట్టుగా అతడు ఎడారి ప్రాంతం పైభాగాన్ని హెలికాప్టర్ క్యాప్‌గ్లాస్‌లోంచి ఒక్కసారి నిశితంగా పరిశీలించాడు.

అతి తక్కువ ఎత్తులో ఎగురుతూ వెళ్తోన్న రెండు విమానాలు..

హంగ్‌కాంగ్‌కి చెందిన కెరోల్ ఎయిర్ సర్వీసెస్‌కు చెందిన ఎ.ఎన్.26 విమానాలవి. రక్షణ వ్యవస్థని అతలాకుతలం చేస్తూ ఆయుధాలు అక్రమంగా పంపుతోన్న పొరుగుదేశపు విమానాలవి...

గగనతలాన్ని తూట్లు పొడిచేలా 228 ఎ.కె.56 రైఫిళ్లు, ఏడు 9 ఎం.ఎం.పిస్టల్స్, 10 రాకెట్ లాంచర్స్, 81 టాంక్ విధ్వంసక గ్రెనెడ్‌లు, 61 హాండ్ గ్రెనెడ్స్, 19,792 రైఫిల్ బుల్లెట్స్, 3,840 నైన్ ఎం.ఎం. పిస్టల్ బుల్లెట్స్, 890 ఎసాల్ట్ రైఫిల్ మ్యాగజీన్స్, టెలిస్కోపిక్ సైట్, 2 డిటోనేట్ బాక్స్, 3 పారాచూట్స్, 17 రివాల్వర్ బ్యాగ్స్, 154 కాన్వాస్ బ్యాగ్స్‌తో పురూలియా (పశ్చిమ బెంగాల్)లో పట్టుబడ్డ విమానం లాంటి... విమానాలవి !!

అతడి మెదడు క్షణం పాటు కాలిక్యులేటరే అయింది...

భరతమాతను ఆయుధాల మీద శిలువేస్తున్నట్టు చలించిపోయాడు. ఈ ఆయుధాలు ఎవరు ఎవరికి సరఫరా చేస్తున్నారు ? ఇప్పుడా విమానాలని తనొక్కడు నేల కూల్చగలడా ? ఎలా ? ఎటాక్ చేయ్యమని ఎ.టి.సి. కూడా ఏ మెసెజ్ పంపలేదే ? శత్రువుని మట్టుబెట్టడానికి ఎవరి అనుమతీ అక్కర్లేదు. కాని ఎలా ?

క్షణంలో హెలికాప్టర్ వేగం పెరిగింది. ఆందోళన పడుతున్న సెంట్రల్ మినిస్టర్ కేసి చూసి 'ఎక్స్‌క్యూజ్‌మీ సర్' అన్నాడు. ఏ ఆయుధమూ లేక పోయినా ఒకే ఒక్క ఆలోచన అతడిలో మెరిసింది...

అంతే ! విమానాల కంటె కూడా హెలికాప్టర్ వేగం పెరిగింది.

"కెప్టెన్ వద్దు... ఇందులో నేనున్నాను" మినిస్టర్ అరుపులు అతడికి విన్పించలేదు. పది నిమిషాలపాటు తూనీగలా దూసుకెళ్తున్న దానివేగం మంత్రి గుండెను దడదడలాడించింది.

విమానాలకంటె ముందుకెళ్లి నిదానంగా హెలికాప్టర్‌ని ఇసుకలో దింపి గమనించాడు. విమానాలు రెండు సమానవేగంగా ఒకదాని వెనక ఒకటి తక్కువ ఎత్తులో వస్తున్నాయి.

వాటి వేగాన్ని అంచనా వేసిన మరుక్షణమే అవి హెలికాప్టర్ దరిచేరగానే హెలికాప్టర్ రెక్కల వేగాన్ని ఒక్కసారిగా పెంచాడు.

అంతే !

క్షణంలో ఇసుక అలలు అలల్లా ఎగిసిపడి... ఇసుక తుఫాను లేచింది. జరగబోయే ప్రమాదం గుర్తించి భయంగా మంత్రి మొహాన్ని మోకాళ్ల మధ్య దాచుకున్నాడు. హెలికాప్టర్ రెక్కల వేగానికి కన్నుమిన్ను కానకుండా ఇసుక ఆకాశాన్ని తాకుతోంది. సుడిగాలులు

విస్ఫోటమైనట్టు ఎగిసి ఎడారిని కప్పేస్తున్న ఇసుక...

నిమిషం తర్వాత...

ఒక్క క్షణం... గాల్లో రెండు విమానాలు ఢీకొన్న శబ్దం !

ఎడారిలో ప్రతి ఇసుక రేణువూ దద్దరిల్లేలా భారీ విస్ఫోటనం...

శకలాలై ఎగిరిపోయిన ఆయుధాలు... ఆకాశంలో సూరీడు బద్దలైనట్టు మంటలు...

ఆయుధ సరఫరా నిజమేనన్నట్టు ఓ 9 ఎం.ఎం. పిస్టల్ కెప్టెన్ కాళ్లదగ్గర ఎగిరొచ్చి పడింది. ఉద్వేగంగా దాన్ని చేతిలోకి తీసికొంటుంటె...

"బాస్టర్డ్... వాటినెందుకు బ్లాస్ట్ చేసావ్ ?" రౌద్రంతో ఊగిపోతున్న మినిస్టర్ కోపంగా అరిచాడు.

చివాలున తలెత్తిన కెప్టెన్ మన్‌ప్రీత్ క్షణంపాటు అవాక్కయ్యాడు. మరుక్షణమే మినిస్టర్ ఛాతి పిస్టల్ గుళ్ళతో జల్లెడలా అయింది. కళ్లు నిప్పుకణికెలవుతుంటె "ఎదురొడ్డి వస్తున్న శత్రువుతో ఎంత కాలమైనా పోరాడగలంరా... కాని మీలాంటి అంతర్గత శత్రువులతోనే దేశం ముక్కలవుతోంది..." రొప్పుతూ అరిచాడు.

ఇసుక రేణువులు రక్తంలో నానుతుంటె దబ్బున ఇసుకలో కూలిపోయాడు మంత్రి.

ఇసుక తుఫాను నిశ్శబ్దమై తగ్గుతోంది...

యుద్ధం సద్దుమణిగినట్టు ఎడారంతా నిశ్శబ్దం...

మన్‌ప్రీత్ పిస్టల్‌ని దూరంగా విసిరేసి... బూటు కాలితో మంత్రి శవాన్ని బలంగా తన్నాడు... కళ్లనిండా కసి...

"నీలాంటి దొంగల వల్లేరా... సస్యశ్యామల దేశం మనది... సంభవామి యుగేయుగే అనాల్సిన వాక్యాలు... సస్యస్కాముల దేశం మనది... స్కాంభవామి యుగే యుగే అనాల్సొస్తుంది..."

అతడు గుండె గాయాల క్షతగాత్రుడై ఎడారిలో కదిలిపోయాడు. అక్కడ గాలి... జాతీయగీతాన్ని ఈలపాటగా పాడుతోంది.

●